# పునరుజ్జీవనోద్యమం, సంస్కరణోద్యమాలు...

భారత్‌లో సాంఘిక, మత సంస్కరణోద్యమాలు పందొమ్మిదో శతాబ్దిలో ప్రారంభమయ్యాయి. బెంగాల్‌లో ప్రారంభమైన ఈ ఉద్యమం క్రమంగా దేశవ్యాప్తమైంది. ప్రాచీన భారతీయ సాహిత్య అధ్యయనం, ఆంగ్లవిద్య, సాహిత్య ప్రభావం, జాతీయతా భావం, విదేశీయులు భారతీయ సంస్కృతిని అణచివేయడానికి పాటించిన విధానాలకు వ్యతిరేకత, పాశ్చాత్య ప్రలోభాల్లో భారతీయులు పడకుండా చేయడం వంటి పలు కారణాలు కూడా పునరుజ్జీవనోద్యమానికి దోహదం చేశాయి.

పునరుజ్జీవనోద్యమానికి పాటుపడిన ఆయా సంస్థలు, వ్యక్తుల గురించి క్లుప్తంగా..

## రాజారామ్ మోహన్ రాయ్ (1774–1833)

ఆధునిక యుగకర్తగా, బెంగాల్‌లో ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి ప్రథమ నాయకునిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాడు. ఈస్ట్ ఇండియా కంపెనీలో సామాన్య ఉద్యోగిగా పనిచేసే కాలంలో జాన్ డిగ్బీకి సన్నిహితుడై ఆంగ్లభాష నేర్చుకున్నాడు. ఇస్లాం మతస్థులకు మూలగ్రంథమైన ఖురాన్‌ను పఠించి తుహ్ఫాత్ ఉల్ మువాహిద్దీన్ అనే గ్రంథాన్ని రచించి, 1803లో ముద్రించాడు. ఏకేశ్వరోపాసన ప్రతిమత సిద్ధాంతమని తెలిపాడు. వేదాంతాన్ని బెంగాలీ భాషలోకి అనువదించాడు. 1815లో ఆత్మీయసభను స్థాపించాడు. ప్రజలను చైతన్యపరచడానికి బెంగాలీ వారపత్రిక సంవాద కౌముది, పర్షియన్ వారపత్రిక మిరాట్–ఉల్–అక్బర్ పత్రికలను నడిపాడు. వీటిలో ప్రధానంగా రాజకీయ, మత, నైతిక విషయాలను చర్చించేవారు. రాయ్ రచించిన పుస్తకాలు బెంగాలీ భాషలో 30 వరకు, ఆంగ్లభాషలో 40 వరకు ఉన్నాయి. 1820లో వెలువడిన 'ది ప్రిసెప్స్ ఆఫ్ జీసస్', 'ది గైడ్ టు పీస్ అండ్ హ్యాపీ నెస్' సంకలనాలు ముఖ్యమైనవి. ఇతడు హరిహరానంద వద్ద తంత్ర శాస్త్రాన్ని నేర్చుకున్నాడు.

రాయ్ నాయకత్వంలో 1828లో బ్రహ్మసమాజం ఆవిర్భవించింది. సమాజ సభ్యుల ఆరాధనలకు, ఉపాసనలకు 1830లో బ్రహ్మ మందిరాన్ని నిర్మించాడు. మానవులంతా ఒకే కుటుంబానికి చెందినవారని సమాజ సభ్యులు విశ్వసించారు. సతీసహగమన దురాచారాన్ని రూపుమాపడానికి, భారత్‌లో ఆంగ్ల విద్యావ్యాప్తికి కృషిచేసిన సంఘసంస్కర్త ఇతడు. ఈ విషయంలో గవర్నర్ జనరల్ విలియం బెంటిక్‌కు సహకారాన్నిచ్చాడు. మొఘల్ వంశ చక్రవర్తి II అక్బర్ క్రీ.శ. 1832లో రాజారామ్ మోహన్ రాయ్‌కు 'రాజా' అనే బిరుదునిచ్చాడు. రాయ్ 1833 సెప్టెంబర్ 27న ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్ నగరంలో మరణించాడు.

## దేవేంద్రనాథ్ ఠాగూర్ (1817–1905)

రాయ్ మరణానంతరం బ్రహ్మ సమాజానికి నాయకత్వం వహించిన ప్రముఖుడు. ఈయన 1842లో బ్రహ్మసమాజ సభ్యత్వాన్ని స్వీకరించాడు. ఉపనిషత్తుల ప్రేరణతో తాను 1839లో స్థాపించిన 'తత్వబోధిని సభ'ను బ్రహ్మసమాజంలో విలీనం చేశాడు. వేదాలను, ఉపనిషత్తులను బోధించేందుకు 1840లో 'తత్వబోధిని పాఠశాల'ను స్థాపించాడు. 1843లో తత్వబోధిని పత్రికను అక్షయ్‌దత్తా సంపాదకత్వంలో ప్రారంభించాడు. 1843లో బ్రహ్మసమాజ సభ్యులకు నియమ నిబంధనలను పేర్కొంటూ... ఉపనిషత్తుల ఆధారంగా 'బ్రహ్మధర్మం'ను ప్రచురించాడు. ఈయన నాయకత్వంలో బ్రహ్మసమాజం వృద్ధి చెందింది. 1865 నాటికి బ్రహ్మసమాజంలో దేవేంద్రనాథ్, కేశవ చంద్రసేన్‌ల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. కేశవ చంద్రసేన్ బ్రహ్మసమాజం నుంచి వైదొలిగి, 1866లో 'బ్రహ్మసమాజ్ ఆఫ్ ఇండియా'ను స్థాపించాడు. దేవేంద్రనాథ్ నాయకత్వంలోని సమాజం 'ఆది బ్రహ్మసమాజం'గా కొనసాగింది.

## కేశవ చంద్రసేన్ (1838–1884)

ఈయన 1857లో బ్రహ్మసమాజంలో చేరాడు. స్త్రీ విద్య, వితంతు వివాహాలను, వర్ణాంతర భోజనాలను, కులాంతర వివాహాలను సమర్థించాడు. చంద్రసేన్ 1861లో 'హిందూదేశ దర్పణం' అనే పక్షపత్రికను ప్రారంభించాడు. ఇది 1871లో ప్రథమ ఆంగ్ల దినపత్రికగా మారింది. ధర్మతత్వ అనే బెంగాలీ పత్రికను కూడా సేన్ ప్రారంభించాడు. స్త్రీలకు ప్రత్యేకంగా ప్రార్థనా మందిరాన్ని స్థాపించారు. ఈయన స్థాపించిన బ్రహ్మసమాజ్ ఆఫ్ ఇండియా (భారతీయ బ్రహ్మసమాజం)ను నవ బ్రహ్మసమాజం, భరతవర్షీయ సమాజంగా కూడా వ్యవహరిస్తారు. సేన్ నాయకత్వంలో 1870లో స్థాపించిన 'భారత సంస్కరణ సంఘం' భారతీయుల సాంఘిక, నైతిక అభ్యున్నతికి కృషి చేసింది. సేన్ కృషి ఫలితంగా వివాహ వయోపరిమితులను నిర్ణయిస్తూ 1872లో 'నేటివ్ మ్యారేజ్ యాక్ట్' రూపొందింది. ఈ చట్టం ప్రకారం 14 సంవత్సరాలు నిండిన బాలికలు, 18 సంవత్సరాలు నిండిన బాలురు మాత్రమే వివాహానికి అర్హులు. కానీ 1878లో ఈ చట్టానికి విరుద్ధంగా సేన్ తన కుమార్తె వివాహాన్ని యుక్తవయసు లేని కూచ్ బీహార్ యువరాజుతో జరిపించి విమర్శలను ఎదుర్కొన్నాడు.

## శశిపాద బెనర్జీ

కేశవ చంద్రసేన్ ప్రభావంతో 40 సంవత్సరాల పాటు ప్రజాసేవలో గడిపాడు. 1873లో 'సాధారణ ధర్మసభ' అనే మత సంఘాన్ని స్థాపిం

vyoma.net

చాడు. ఈయన స్థాపించిన 'శ్రమజీవి' పత్రిక మొదటి కార్మిక పత్రికగా పేరుగాంచింది. 1887లో కలకత్తాలో వితంతు శరణాలయాన్ని స్థాపించాడు.

## ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820-1891)

బ్రహ్మసమాజ వ్యాప్తికి కృషిచేసిన బెంగాలీ నాయకుడు, సంస్కర్త, నాస్తికుడు, హేతువాది. స్త్రీల అభ్యున్నతికి విద్యాసాగర్ గణనీయమైన కృషి చేశాడు. వితంతు వివాహాలు శాస్త్ర సమ్మతమని 1856లో సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించాడు. ఇతని కృషి ఫలితంగానే బ్రిటిషర్లతో 1856లో 'హిందూ వితంతు పునర్వివాహ చట్టం' రూపొందింది. విద్యాసాగర్ తన గృహంలో అనేక స్త్రీ పునర్వివాహాలను జరిపించాడు. 'వితంతు వివేకం' అన్న గ్రంథాన్ని రాశాడు.

## ప్రాక్టీస్ ప్రశ్నలు

1.ఆధునిక యుగకర్తగా ఇతడు ప్రతీతి?
ఎ) వీరేశలింగం బి) ఈశ్వర చంద్ర విద్యాసాగర్
సి) రాజారామ్మోహన్‌రాయ్ డి) స్వామిదయానంద

2.రాజారామ్మోహన్‌రాయ్‌కు 'రాజా' అన్న బిరుదును ప్రసాదించిన మొఘల్?
ఎ) అక్బర్ బి) రెండో అక్బర్
సి) జహంగీర్ డి) బహదూర్‌షా-2

3.కింది వాటిలో 'హిందూదేశీ దర్పణం' అనే పక్ష పత్రికను స్థాపించింది?
ఎ) దేవేంద్రనాథ ఠాగూర్ బి) కేశవచంద్రసేన్
సి) శశిపాద బెనర్జీ డి) ఈశ్వరచంద్రవిద్యాసాగర్

4.'బ్రహ్మసమాజ్ ఆఫ్ ఇండియా' స్థాపకుడు?
ఎ) రాజారామ్మోహన్‌రాయ్ బి) దేవేంద్రనాథ్ ఠాగూర్
సి) కేశవచంద్రసేన్ డి) వీరేశలింగం

5.'సత్యశోధక్ సమాజ్' అనే సంస్థను స్థాపించింది?
(గత పరీక్షల్లో అడిగిన ప్రశ్న)
ఎ) దయానంద సరస్వతి బి) శ్రీ నారాయణగురు
సి) జ్యోతిరావు పూలె డి) పండిత రమాబాయి

6.ఆంగ్లంలో గోల్డ్‌స్మిత్ రాసిన వికార్ ఆఫ్ ది వేక్‌ఫీల్డ్ ఆధారంగా రూపుదిద్దుకుంది ఏది?
ఎ) సత్యవతి చరిత్ర బి) చంద్రమతి చరిత్ర
సి) రాజశేఖర చరిత్ర డి) సత్యరాజా పూర్వదేశయాత్ర

7.దేవేంద్రనాథ్ ఠాగూర్ 'తత్వబోధిని' సభను స్థాపించిన సంవత్సరం?
ఎ) క్రీ.శ. 1839 బి) క్రీ.శ. 1840
సి) క్రీ.శ. 1842 డి) క్రీ.శ. 1843

8.వివేకానందుని చికాగో సర్వమత సమ్మేళన ప్రసంగాన్ని కొనియాడిన పత్రిక?
ఎ) ప్రబుద్ధ భారత బి) న్యూయార్క్ టైమ్స్
సి) న్యూయార్క్ హెరాల్డ్ డి) ఇందు ప్రకాష్

9.దివ్యజ్ఞాన సమాజాన్ని 1875లో ఇక్కడ స్థాపించరు?
ఎ) అడయారు బి) ముంబయి
సి) న్యూయార్క్ డి) మాస్కో

**జవాబులు**

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
|---|---|---|---|---|---|---|---|
| C | B | B | C | C | A | A | C |

vyoma.net